

పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 321 | పేజీలు - 08 | వెల - 05/- | బుధవారం 18-11-2026

ఏపీకి ఆర్థిక సాయంపై కీలక చర్చ

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో సీఎం చంద్రబాబు భేటీ
- రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై చర్చ
- తుపాను నష్టాలకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి
- నష్టానికి సంబంధించిన నివేదికలు ఇప్పటికే పంపామని వెల్లడి



సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన కేంద్ర మంత్రితో చర్చించారు. ముఖ్యంగా రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ప్రతిపాదనలు అమలు చేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని, తుపానుల వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

అలాగే, ఇటీవల రాష్ట్రంలో అర్నబ్, మురసు తుపానులతో పాటు ఎల్‌నినో ప్రభావం వల్ల జరిగిన నష్టం గురించి నిర్మలా సీతారామన్‌కు వివరించారు.

తుపానుల నష్ట అంచనాలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికలను ఇప్పటికే కేంద్రానికి పంపామని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.

మిగతా 2లో

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి

- రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ
- సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్ఓసీ మంజూరుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూల స్పందన
- తుపాకులగూడెం వద్ద ఇప్పటికే పూర్తయిన బ్యారేజీ నిర్మాణం
- నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు తెలంగాణ సిద్ధం



ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల సమ్మక్క సాగర్ బ్యారేజీకి సంబంధించి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ ప్రాజెక్టు సమగ్ర వివరాలను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి వివరించి, త్వరితగతిన ఎన్ఓసీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందిస్తూ, ఎన్ఓసీ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఎల్‌నినో ప్రభావం,

మిగతాది 2లో

ఎన్విడియాలో ట్రంప్ భారీ పెట్టుబడులు..

- ఎన్విడియాలో 62 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు కలిగి ఉన్న ట్రంప్
- 2024 నుంచి భారీగా పెరిగిన పెట్టుబడులు
- ట్రంప్-ఎన్విడియా బంధంపై పెరుగుతున్న అనుమానాలు
- ఎన్విడియాకు 'నేషనల్ ఛాంపియన్' హోదా ఇచ్చే యోచనలో ప్రభుత్వం
- ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడిగా ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రముఖ చిప్ మేకర్ కంపెనీ ఎన్విడియాలో భారీగా షేర్లు ఉన్నట్లు వెలుగులోకి రావడం

2

ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్..

2



- ఐపీఎల్ నుంచి ఆటగాడిగా తప్పుకున్న ధోనీ
- 2027 ఐపీఎల్ నుంచి సీఎస్‌కే మెంటార్‌గా ధోనీ
- అంతర్జాతీయ క్రికెట్‌పై ధోనీ ప్రభావం ఉంటుందని వెల్లడి
- సీఎస్‌కేకు ఐదు ట్రోఫీలు అందించిన ధోనీ

భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ ఆటగాడిగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కు వీడ్కోలు పలికినప్పటికీ, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)

తెలంగాణ ఇచ్చింది

సోనియమ్మే అయితే.. ఆత్మకథలో ఎందుకు రాయలేదు?

- సోనియా ఆత్మకథలో తెలంగాణ ఏర్పాటు ప్రస్తావన లేదన్న కేటీఆర్
- తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే సమాధానం చెప్పాలని డిమాండ్
- ఇది ప్రజల పోరాట ఫలితం.. సోనియా దయాభిక్ష కాదని స్పష్టీకరణ
- ఉద్యమ కాలం నాటి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ పోస్ట్



2

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని సూటి ప్రశ్న సంధించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే, ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని



2

రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు..

- సోనియా గాంధీ పుస్తకావిష్కరణలో తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకున్న రాహుల్
- తల్లిదండ్రుల భోజన సమయాల గురించి మాట్లాడిన వ్యాఖ్యలపై విమర్శలు
- విమర్శలకు కౌంటర్‌గా ఎక్స్‌లో శివపార్వతుల శిల్పం ఫొటో పోస్ట్ చేసిన ప్రతిపక్ష నేత

పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ నేత

కారుకు నిప్పు

- కడప జిల్లా వేంపల్లెలో ఘటన
- టీడీపీ నేత చెన్నరాయుడు కారును తగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- కారును అడ్డగించి నేత ముందే నిప్పంటించిన దుండగులు
- ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది




2

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం పరిధిలోని వేంపల్లె మండలంలో సోమవారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇడుపులపాయకు చెందిన తరుణంలో చోటుచేసుకున్న ఈ ఘటన టీడీపీ నాయకుడు పి.పి. చెన్నరాయుడు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి దహనం చేశారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ఏపీకి అక్వాన్ తుపాను ముప్పు

- అక్వాన్ తుపానుపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- మచిలీపట్నానికి 660 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను
- ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశం
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దంటూ ముందస్తు సూచనలు



2

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దిశగా దూసుకువస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను తీవ్రత, కదలికలు, ముందస్తు జాగ్రత్తలపై

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు..

- తిరుపతి మోడల్‌లో శబరిమల అభివృద్ధి.. కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అయ్యప్ప భక్తులకు అత్యాధునిక వసతులు
- సమగ్ర మౌలిక వసతుల కల్పన
- కొచ్చి విమానాశ్రయంలో 5,000 చదరపు అడుగుల్లో ప్రత్యేక సేవా కేంద్రం



2

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు కేరళ ముఖ్యమంత్రి వీడీ

ఎన్విడియాలో ట్రంప్ భారీ పెట్టుబడులు..

కంపెనీ ఎన్విడియాలో భారీగా షేర్లు ఉన్నట్లు వెలుగులోకి రావడం సంచలనం సృష్టిస్తోంది. 2026 ఆగస్టు చివరి నాటికి ఆయనకు ఈ కంపెనీలో 13 మిలియన్ల డాలర్ల నుంచి 62 మిలియన్ల డాలర్ల (సుమారు రూ. 121 కోట్ల నుంచి రూ. 579 కోట్ల) విలువైన షేర్లు ఉన్నాయని 'ది వాషింగ్టన్ పోస్ట్' తన నివేదికలో పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వానికి, ఎన్విడియా కంపెనీకి మధ్య సంబంధాలపై అనుమానాలు పెరుగుతున్న సమయంలో ఈ వివరాలు బయటకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్ ఆర్థిక లావాదేవీల పత్రాలను సమీక్షించిన తర్వాత ఈ నివేదికను రూపొందించారు. 2024 చివరి నాటికి ట్రంప్ పేరిట ఎన్విడియాలో ఉన్న షేర్ల విలువ కేవలం 615,000 డాలర్ల నుంచి 1.3 మిలియన్ డాలర్ల మధ్య ఉండేది. కానీ, 2026 ఆగస్టు నాటికి ఆ విలువ ఏకంగా 13 మిలియన్ డాలర్ల నుంచి 62 మిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ రెండేళ్లలో ఆయన పెట్టుబడి ఊహించని రీతిలో పెరిగినట్లు స్పష్టమవుతోంది. అయితే, ఆగస్టు తర్వాత రెండు నెలల కాలంలో జరిగిన స్టాక్ ట్రేడింగ్ వివరాలు ఈ పత్రాల్లో లేవని, వాటి వెల్లడికి కొంత సమయం పడుతుందని నివేదిక పేర్కొంది.ఒకవైపు

ఈ వివాదాలు నడుస్తుండగానే, ఎన్విడియాతో పాటు మరో రెండు డజన్ల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంపెనీలను 'నేషనల్ ఛాంపియన్స్'గా ప్రకటించేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం ప్రచురించింది. అమెరికా సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలకు ఈ కంపెనీలు వ్యూహాత్మకంగా ముఖ్యమైనవని గుర్తించడమే ఈ హోదా ఉద్దేశం. ట్రంప్ ప్రభుత్వంతో ఎన్విడియా సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా పరిశీలనకు గురవుతున్నాయి. ముఖ్యంగా అధునాతన ఏఐ చిప్‌లపై అమెరికా విధానం, వాటిని చైనా పొందకుండా నిరోధించడం వంటి అంశాల్లో ఈ పరిశీలన జరుగుతోంది. మరోవైపు, కంపెనీ సహ వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ సిలికాన్ వ్యాలీలో ట్రంప్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా పేరుంది. వీరిద్దరి మధ్య 2025 నుంచే మంచి సంబంధాలున్నాయి.

గత ఏడాది డిసెంబర్‌లో ఎన్విడియా తయారు చేసిన ఎ200 ఏఐ ప్రాసెసర్లను చైనాకు విక్రయించేందుకు ట్రంప్ అనుమతించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామాల మధ్య, ఎన్విడియా తన త్రైమాసిక ఆర్థిక ఫలితాలను నేడు ప్రకటించనుంది. ఏఐ చిప్‌లకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ ఫలితాలపై పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఏపీకి అక్వాన్ తుపాను ముప్పు

తీవ్రత, కదలికలు, ముందస్తు జాగ్రత్తలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాజా పరిస్థితులను సమీక్షించిన సీఎం, విపత్తు నిర్వహణ విభాగంతో పాటు తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశారు.

వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. ప్రస్తుతం అక్వాన్ తుపాను చెన్నైకి 610 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 660 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 670 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 19, 20 తేదీల్లో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు సీఎంకు వివరించారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని, హెచ్చరికలను పంపేందుకు పటిష్ఠమైన సమాచార వ్యవస్థను అందుబాటులో ఉంచాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందులో భాగంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందిని క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సిబ్బంది నేరుగా ప్రజల వద్దకు వెళ్లి తుపాను ముప్పుపై అవగాహన కల్పించాలని, అవసరమైన రక్షణ చర్యలపై వారికి సమాచారం అందించాలని ఆదేశించారు.

సముద్రం అల్లకల్లోలంగా మారే సూచనలు ఉండటంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి

అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల తాగు,



సాగునీటి అవసరాల నిమిత్తం సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతించాలని, మిగిలిన క్లియరెన్సుల విషయంలోనూ సహకరించాలని కోరారు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల అవసరాలను తీర్చేందుకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. గతంలో ఈ ప్రాజెక్టును కాంతనపల్లి వద్ద ప్రతిపాదించగా, అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే పరిస్థితి ఉండేది. దీనివల్ల 17 ఆదివాసీ గ్రామాలు మునిగిపోవడంతో పాటు భద్రత, మౌలిక వసతులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. దాంతో ముంపు తీవ్రతను కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రదేశాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

ప్రాజెక్టు ప్రభావంపై అధ్యయనం జరిపేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ సర్కార్ రూ. 9.883 కోట్లను ఏప్రిల్‌లోనే చెల్లించింది. అనంతరం క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తి చేసిన ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందజేసింది. తుపాకులగూడెం వద్ద బ్యారేజీ నిర్మించడం వల్ల ఛత్తీస్‌గఢ్ పరిధిలో కేవలం 33 ఎకరాల భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. అత్యంత భారీ వరదలు వచ్చిన సందర్భంలో కూడా ఈ ముంపు ప్రాంతం 100 ఎకరాలకు మించదని తేలింది.

తుపాకులగూడెం వద్ద ఇప్పటికే సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. ఛత్తీస్‌గఢ్ భూభాగంలో అవసరమైన భూసేకరణ, పరిహారం, పునరావాస చర్యలకు సంబంధించి నిబంధనల ప్రకారం నిధులు చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయినందున ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఓసీ జారీతో పాటు ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు..

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును అమలు



చేయనున్నట్లు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రకటించారు. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు సమగ్రమైన రీతిలో అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం (సియాల్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శబరిమల యాత్రికుల సహాయ కేంద్రాన్ని (ఫెసిలిటేషన్ సెంటర్) ముఖ్యమంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కేరళలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అయ్యప్ప భక్తులు శబరిమలలో దర్శనం ముగిసిన వెంటనే వెనుదిరగకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను కూడా సందర్శించేలా ఒక ప్రత్యేక నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా శబరిమలకు వచ్చే భక్తుల సంఖ్య సుమారు 50 శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శబరిమల దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రస్తుతం కొనసాగుతున్న మండల పూజా సీజన్ ముగిసిన తర్వాత ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వృశ్చిక మాసం సీజన్ ప్రారంభానికి ముందే అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని, పంబ, సన్నిధానంలలో స్వయంగా సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.

మరోవైపు, కొచ్చి విమానాశ్రయంలోని డొమెస్టిక్ అరైవల్ టెర్మినల్ సమీపంలో 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇక్కడ శబరిమలకు నేరుగా వెళ్లే కేరళ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్సు సర్వీసులను కూడా ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు.


దీంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా చార్టర్డ్ బస్సులు, హెలికాప్టర్ బుకింగ్ కౌంటర్, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు హెల్ప్ డెస్క్, ప్రసాదం కూపన్ కౌంటర్లను ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రీపెయిడ్ ట్యాక్సీ బుకింగ్, శాకాహార భోజన శాల, ఎయిర్ కండిషన్డ్ విశ్రాంతి గదులు, ఉచిత వైఫై, విమానాల రాకపోకలను ఎప్పటికప్పుడు తెలియజేసే ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వ్యవస్థను కూడా భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే అయ్యప్ప భక్తులకు ఈ కేంద్రం ద్వారా ప్రయాణం మరింత సులభతరం కానుంది.

సర్పంచ్ పదవికి టెండర్ తరహా ఎంపిక: నక్కలపల్లిలో రూ.25.60 లక్షల బిడ్!

అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలంలోని నక్కలపల్లి గ్రామంలో సర్పంచ్ పదవి ఎంపిక కోసం స్థానికులు అనుసరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. గ్రామాభివృద్ధికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తారనే అంశంపై చీటీల ద్వారా సర్పంచ్ అభ్యర్థిని ఖరారు చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

నక్కలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఈసారి మహిళకు రిజర్వ్ అయింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఈ పదవిని ఆశించారు. అయితే ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసే బదులు, ఆ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఇస్తే బాగుంటుందనే ప్రతిపాదన గ్రామస్తుల మధ్య వచ్చింది. ఈ క్రమంలో సర్పంచ్ పదవి కోసం పోటీపడే అభ్యర్థులు గ్రామాభివృద్ధి కోసం ఎంత మొత్తం ఖర్చు చేయగలరో చీటీలపై రాసి దబ్బాలో వేయాలని నిర్ణయించారు. మొత్తం 9 మంది అభ్యర్థులు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

అందరూ వేసిన చీటీలను గ్రామస్తుల సమక్షంలో తెరిచి చూడగా, స్థానిక నాయకుడు సుదర్శన్ రెడ్డి తన భార్య అఖిల పేరుతో అత్యధికంగా రూ.25.60 లక్షలు ఇస్తామని రాశారు. మిగిలిన వారందరి కంటే ఈ మొత్తమే ఎక్కువగా ఉండటంతో, గ్రామస్తులంతా



ఏకతాటిపైకి వచ్చి అఖిలను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. గతంలో కూడా ఇదే గ్రామంలో రూ.21 లక్షల విరాళం ప్రతిపాదనతో సర్పంచ్‌ను ఇదే తరహాలో ఎంపిక చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

అయితే, గ్రామాభివృద్ధి పేరుతో నిర్వహించిన ఈ ఎంపిక విధానంపై చట్టపరమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో పంచాయతీ ఎన్నికలు పూర్తిగా ఎన్నికల సంఘం నిబంధనలు, రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాల ప్రకారమే జరగాల్సి ఉంటుంది. గ్రామస్తులు తమ స్థాయిలో నిర్వహించుకున్న ఈ రకమైన వేలం లేదా టెండర్ విధానాలకు చట్టబద్ధమైన గుర్తింపు ఉండదు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, అధికారిక పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్ ఎన్నిక చెల్లుబాటు అవుతుంది.

ఏపీకి ఆర్థిక సాయంపై కీలక చర్చ

(మొదటి పేజీ తరువాయి)



అధికారిక సమావేశం అనంతరం, సీఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నివాసంలో జరిగే ఒక శుభకార్యానికి హాజరుకానున్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత రాత్రికి ఆయన అమరావతికి తిరిగి పయనం కానున్నారు.

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే..
ఆత్మకథలో ఎందుకు రాయలేదు?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదని, అది తెలంగాణ ప్రజల పోరాట ఫలితమని కేటీఆర్ స్పష్టం చేశారు. తాజాగా ఆయన ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో భాగంగా 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు తాను చేపట్టిన పాదయాత్రకు 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు సాగిన ఆ పాదయాత్ర తనకు ఓ గొప్ప జ్ఞాపకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ చరిత్రను ప్రస్తావిస్తూ, సోనియా గాంధీపై, కాంగ్రెస్‌పై ఆయన ఈ విమర్శలు చేసినట్లు స్పష్టమవుతోంది.

పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ
నేత కారుకు నిప్పు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి చెన్నరాయుడు తన వాహనంలో వేంపల్లె మండలంలోని గండి రోడ్డు మీదుగా వెళుతుండగా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును అడ్డుకున్నారు. అనంతరం చెన్నరాయుడు చూస్తుండగానే కారుకు నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందిన వెంటనే డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) మురళీ నాయక్ నేతృత్వంలోని పోలీస్ బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలను అదుపు చేశారు. ఈ దాడి జరిగిన ప్రదేశంలో ఖాళీ బీరు సీసాలు, చెప్పులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను, నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ దాడికి పాల్పడ్డారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. రెండు రోజుల క్రితమే టీడీపీ పులివెందుల ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) ఈ ప్రాంతంలో పర్యటించి, సర్పంచ్ అభ్యర్థిగా ఎస్. గౌస్ పేరును ప్రకటించారు. గత 50 ఏళ్లలో ఈ స్థానానికి ఒక మైనారిటీ నేతను బరిలోకి దించడం ఇదే తొలిసారని, ఇక్కడ కచ్చితంగా విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ రాజకీయ పరిణామం చోటుచేసుకున్న కొద్ది రోజులకే చెన్నరాయుడు వాహనాన్ని తగలబెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వేంపల్లె మండలంలో గతంలోనూ రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్న చరిత్ర ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, బాధ్యులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు..

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న అనుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రేమను వ్యక్తపరచడం, అనుభవించడం అనే అంశంపై ఆయన ఒక రాజకీయ ప్రకటనను విడుదల చేస్తూ, దానికి సంబంధించి ఒక ఆలయ శిల్పం ఫొటోను జతచేశారు. సోనియా గాంధీ జీవిత అనుభవాలతో రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సోమవారం రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే ప్రతిసారీ తన తండ్రి రాజీవ్ గాంధీ ఒళ్లో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని రాహుల్ పేర్కొన్నారు. "ప్రతి రోజూ భోజన సమయంలో నాన్న ఉండేవారు, నాన్న ఒళ్లో అమ్మ కూర్చునేది" అని రాహుల్ అనడంతో, వేదికపై ఉన్న సోనియా గాంధీ కాస్త ఇబ్బందిగా సవ్వారు. సాధారణంగా ఇతర కుటుంబాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించవని ఆ తర్వాత తనకు అర్థమైందని, చిన్నతనంలో ఇది సాధారణ విషయమే అనుకుని ఒక స్నేహితుడిని వారి తల్లిదండ్రుల గురించి కూడా అలాగే ప్రశ్నించానని రాహుల్ వివరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు, చర్చలు మొదలయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన రాహుల్ గాంధీ, మంగళవారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. పవిత్ర నందిపై శివపార్వతులు కలిసి ఆసీనులైనట్లు ఉన్న ఒక పురాతన ఆలయ శిల్పం చిత్రాన్ని ఆ పోస్ట్‌కు జతచేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం గూడుకట్టుకున్నాయి. అవి వారిని ప్రేమను అనుభూతి చెందకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయి. ఒక నిజమైన హిందువుగా వారిని ఈ వలయం నుంచి విముక్తులను చేయడం నా బాధ్యత. తద్వారా వారు కూడా తమ జీవితాల్లో అద్భుతమైన ప్రేమ, అనుబంధాల సౌందర్యాన్ని, ఆనందాన్ని అనుభవించడం ప్రారంభిస్తారు... సత్యం శివం సుందరం" అని పేర్కొన్నారు.

ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్..

(మొదటి పేజీ తరువాయి)

(ఐపీఎల్) కు వీడ్కోలు పలికినప్పటికీ, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుతో అతడి అనుబంధం కొనసాగుతుండటంపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ రషీద్ లతీఫ్ హర్షం వ్యక్తం చేశాడు. 2027 ఎడిషన్ నుంచి సీఎస్‌కే జట్టుకు మెంటార్‌గా ధోనీ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు. ఈ నిర్ణయం రాబోయే తరం క్రికెటర్లకు ఎంతగానో దోహదపడుతుందని, ధోనీ ప్రభావం కేవలం ఒక ఫ్రాంచైజీకి మాత్రమే పరిమితం కాకుండా అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా విస్తరిస్తుందని లతీఫ్ అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్‌కు ధోనీ అందించిన అద్భుత సేవలను లతీఫ్ గుర్తుచేసుకున్నాడు. ఐపీఎల్‌లో సీఎస్‌కే పసుపు రంగు జెర్సీలో, నంబర్ 7 తో ధోనీ అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచారని ప్రశంసించాడు. ఆటగాడిగా బరిలోకి దిగకపోయినా చెన్నైలోని చెపాక్ స్టేడియంలో గతంలో ఉన్న వాతావరణమే మునుముందూ కొనసాగుతుందని పేర్కొన్నాడు. మెంటార్ పాత్రలో ధోనీ వంటి గొప్ప నాయకుడు అందుబాటులో ఉండటం భవిష్యత్ తరానికి ఎంతో ప్రయోజనకరమని అన్నాడు. దాదాపు 15 సంవత్సరాల పాటు ధోనీ భారత క్రికెట్‌ను శాసించాడని, ఎంతోమంది యువ ఆటగాళ్లకు ఆదర్శంగా నిలిచాడని లతీఫ్ వివరించాడు. పాకిస్థాన్ మినహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల క్రికెటర్లు ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నందున, డ్రెస్సింగ్ రూమ్‌లో ధోనీ ఇచ్చే సూచనలు ప్రపంచ క్రికెట్‌పై స్పష్టమైన ప్రభావాన్ని చూపుతాయని చెప్పాడు. ధోనీ నిస్సందేహంగా గొప్ప భారతీయ క్రికెటర్ అని, అతడి భవిష్యత్ ప్రయాణానికి తన శుభాకాంక్షలు ఉంటాయని వెల్లడించాడు. ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టును ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపి అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా ధోనీ గుర్తింపు పొందాడు. లీగ్ చరిత్రలో ఒకే ఫ్రాంచైజీకి 200 కంటే ఎక్కువ మ్యాచ్‌ల్లో నాయకత్వం వహించిన ఏకైక సారథిగా చరిత్ర సృష్టించాడు. సీఎస్‌కే ప్రయాణంలో

గోస్పాడు మండలంలో పోలీసు ఆధ్వర్యంలో ల్యాబ్ మార్చ్.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రానున్న గ్రామ పంచాయతీ



ఎన్నికల నేపథ్యంలో సాంబవరం , కాండ్లపల్లి మరియు జిల్లెల్ల గ్రామాలలో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా ప్రజలకు భరోసా కల్పించడం జరిగింది.
ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించడం జరిగింది. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది.

ఫెమినా ఖజానా షాప్ ఘన ప్రారంభోత్సవం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నూతన మున్సిపల్ చైర్మన్ గౌరవనీయులు డా. పి.



బాబన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఫెమినా ఖజానా షాప్‌ను ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా చైర్మన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వ్యాపార అభివృద్ధికి ఆకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్ , షుకూర్ , జీలానీ , ఇస్మాయిల్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. నూతన మున్సిపల్ చైర్మన్ డా. పి. బాబన్ చేతుల మీదుగా జరిగిన ఈ ప్రారంభోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫెమినా ఖజానా యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కైరుప్పల రూప నామినేషన్ దాఖలు.

ఆస్పరి (పల్లె వెలుగు): ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం కైరుప్ప గ్రామంలో స్థానిక



ఎన్నికల నేపథ్యంలో కైరుప్పల రూప నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి గ్రామ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, గ్రామ పెద్దలు, వార్డు మెంబర్ అభ్యర్థులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర ప్రసాద్(బాబు), మాజీ సర్పంచ్ బీటెక్ వీరభద్ర, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ, గ్రామ నాయకులు శేషు రెడ్డి, కుడుమల రామకృష్ణ, జయన్న, శంకర్, ఎంకప్ప పెద్ది ట్రాక్టర్ ఈరన్న, పుట్టా వీరేష్, జగదీష్, ప్రధాని బసవరాజు, వడ్డే చిన్న నరసన్న, వడ్డే ఊరుకుందు, మందుల నాగలింగ, పూజారి శేఖర్, పెద్ది శేఖర్, రాజమ్మ, జీకే వీరేష్, మాల ఈరన్న, భాస్కర్, చక్రవర్తి, బొంతల వీరభద్ర, హరిజన పరమేశు, శివ రాము, బజారి, సోమన్న, బోయ పెద్ద రంగన్న, బల్ల వీరభద్రి, గజ్జి వెంకటేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే హైస్కూల్ చైర్మన్ ఎదురింటి రామకృష్ణ, వార్డు మెంబర్ అభ్యర్థులు, యువ నాయకులు, గ్రామ పెద్దలు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని కైరుప్పుల రూప కు శుభాకాంక్షలు తెలిపారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. కైరుప్పకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..



పాణ్యం నవంబర్ 17 పల్లె వెలుగు : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు పాణ్యంలోని శ్రీ లక్ష్మీ గాయత్రి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్, కేఆర్ఆర్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారులు, బీడీసీ సిబ్బంది పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈ నెల 20న అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాల అకాడమీలో చిత్రలేఖన విజేతలకు బహుమతుల ప్రదానం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని స్థానిక బాల అకాడమీ పాఠశాలలో



విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారి కళాత్మక ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎస్‌బీఐ లైఫ్ మరియు వాసవి జాగృతి నవనంది క్లబ్, నంద్యాల వారి ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలోని చిత్రకళా నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు.
ఈ సందర్భంగా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.
కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవీంద్రనాథ్ సార్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుంచే మంచి విలువలను అలవర్చుకుంటూ, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమలోని ప్రతిభను గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థులకు చక్కటి సందేశాన్ని అందించారు. కేవలం చదువులోనే కాకుండా కళలు, క్రీడలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ రాణించినప్పుడే విద్యార్థుల సమగ్ర వికాసం సాధ్యమవుతుందని ప్రోత్సహించారు.
ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ బృందం నుండి మేనేజర్ బి. రామకుమార్, పి. అనిల్ కుమార్, పి. శివానంద పాల్గొన్నారు. అదేవిధంగా వాసవి జాగృతి నవనంది క్లబ్, నంద్యాల తరఫున ఐసీసీ ఆఫీసర్ పి. అనిల్ కుమార్, ప్రెసిడెంట్ ఎం. సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ వై. మురళీమోహన్, ట్రెజరర్ పి. పుల్లయ్య, కోఆర్డినేటర్ వి. మోహన్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను గుర్తించి, వారి ప్రతిభకు ప్రోత్సాహాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన ఎస్‌బీఐ లైఫ్ బృందానికి, వాసవి జాగృతి నవనంది క్లబ్ సభ్యులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

గెలుపే ధ్యేయం.. గ్రామ అభివృద్ధే మా లక్ష్యం.

● ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం. ● గతంలో పదవులు లేకున్నా గ్రామ ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేసిన చరిత్ర మాది. ● నిత్యం గ్రామంలోనే ఉంటాం.. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాం. ● రాయమాల్పురం గ్రామ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థి అల్వకొండ ప్రభావతి.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామం సర్పంచ్ బరిలో ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థి ఆల్వకొండ ప్రభావతి, ఆల్వకొండ ప్రేమ్ కుమార్ లు గ్రామ ప్రజలను కోరారు. మంగళవారం గ్రామంలోని వివిధ కుల, మత సంఘాల నాయకులను వారు కలిసి గ్రామ సర్పంచ్ గా మాకు ఒక అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆల్వకొండ ప్రేమ కుమార్, ఆల్వకొండ ప్రభావతి లు మాట్లాడుతూ... మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి వెంట గత 20 సంవత్సరాలు నుంచి ఉంటూ గ్రామ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. అయితే



ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికల్లో శిల్పా కుటుంబం మా కుటుంబానికి మొండి చేయి చూపి సర్పంచ్ టికెట్ ఇవ్వకపోవడంతో గ్రామ ప్రజల నమ్మకం, విశ్వాసంతోనే ఇండిపెండెంట్ గా పోటీ చేస్తున్నామన్నారు. గతంలో గ్రామంలోని 40 మంది పేద ప్రజలకు ఇండ్ల పట్టాలు ఇప్పించడంతోపాటు భారత్ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేసిన ఘనత మాదేనన్నారు. మరి ముఖ్యంగా ప్రభుత్వ సీలింగ్ భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించడం, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేపించడం వంటి కార్యక్రమాలు అనేకం చేశామన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్క పింఛన్ దారుడికి పింఛన్ వచ్చే విధంగా కూడా కృషి చేశామన్నారు. గ్రామంలో చిన్న, పెద్ద మరియు కుల మత బేధాలు లేకుండా అందర్నీ కలుపుకొని అందరికీ అందుబాటులో ఉంటున్నాం అనే విషయం గ్రామ ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఎటువంటి పదవులు లేకున్నప్పటికీ గ్రామ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్న మా కుటుంబానికి ప్రస్తుతం వస్తున్న సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ ప్రజలంతా అండగా నిలిచి అత్యధిక భారీ మెజారిటీతో గెలిపిస్తారని మేము గ్రామ ప్రజలను కోరారు.

జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు సమగ్ర కార్యాచరణ చేపట్టాం.

● చెరువుల అనుసంధానం (క్యాస్కేడ్ విధానం) ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాం. ● మురుగునీరు నదుల్లో కలవకుండా ఎస్టీపీ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి. ● 7వ జాతీయ జల అవార్డుల సాధనకు జిల్లాలో చేపట్టిన ఉత్తమ కార్యక్రమాలను సమర్థవంతంగా వివరించండి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో జల వనరుల సంరక్షణ, భూగర్భ జల మట్టాల పెంపు, చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కేంద్ర బృంద సభ్యులైన కేంద్ర జల సంఘం జల సంచయ్ – జల భాగీదారీ విభాగానికి చెందిన ఈఈ రామప్రసాద్, ఎస్‌డీఈ నాగార్జునతో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని డోన్, ప్యాపిలి, బేతంచర్ల, బనగానపల్లి, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాలు పూర్తిగా రాతిమయంగా ఉండి తక్కువ నీటి ఇంకుడు సామర్థ్యం, కాలువల సదుపాయం లేకపోవడం వల్ల భూగర్భ జలాల పెంపు సవాలుగా మారిందన్నారు.



ఈ నేపథ్యంలో వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలోని చెరువులను అనుసంధానిస్తూ క్యాస్కేడ్ విధానంలో అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా 27 క్యాస్కేడ్ల పరిధిలోని 86 చెరువుల ద్వారా నీటి నిల్వ, ప్రవాహ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఫీడర్ ఛానళ్లను గుర్తించి పునరుద్ధరించడం, వాటి జియో లొకేషన్లను నమోదు చేయడం ద్వారా పనుల పర్యవేక్షణను మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫీడర్ ఛానళ్ల అభివృద్ధికి సంబంధించి 2,151 పనులు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.
అలాగే పట్టణ ప్రాంతాల నుంచి వెలువడే మురుగునీరు నదుల్లో కలవకుండా శుద్ధి చేసేలా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కుందూ నది పరిరక్షణతో పాటు రైతులకు సాగునీటి వనరులు కలుషితం కాకుండా చూడటం ముఖ్యమన్నారు. జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి, చెరువుల అనుసంధానం, భూగర్భ జలాల పెంపు, నీటి సమర్థ వినియోగం వంటి అంశాల్లో చేపట్టిన కార్యక్రమాలను జాతీయ జల అవార్డుల మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర ఆధారాలతో సిద్ధం చేసి చూపించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



ఆపద సమయంలో ఫోన్ చేయండి

మహానంది, పల్లె వెలుగు అపద సమయంలో 100,112 నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం అల్లినగరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నో టచ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్ కి తెలపాలన్నారు. శక్తి యాప్ తల్లిదండ్రుల ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. శక్తి యాప్ మన దగ్గర ఉంటే ఆపద సమయంలో మన వెంట రక్షణ ఉన్నట్లే అన్నారు. అపరిచిత వ్యక్తుల వద్ద ఏ తినుబండాలు తీసుకోవద్దని, అప్రమత్తంగా సూచించారు. ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనగణన ప్రక్రియను పకడ్బందీగా,

పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి.

● జనగణనలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కచ్చితత్వంతో సేకరించాలి. ● హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్‌లో ఎలాంటి ఖాళీలు లేకుండా ప్రతి నివాస ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో కవర్ చేయాలి. ● ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నాణ్యమైన శిక్షణ అందించాలి. ● జనగణన దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కీలకమైన ప్రక్రియ. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జనగణన ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, కచ్చితత్వంతో, నిర్దీత మార్గదర్శకాల ప్రకారం నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం రానున్న పదేళ్లలో దేశ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ విధానాల రూపకల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు కీలక ప్రాతిపదికగా నిలుస్తుందని, ఈ బాధ్యతను ప్రతి అధికారి పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు.

మంగళవారం నంద్యాల పట్టణంలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జనగణన కార్యకలాపాల నిర్వహణపై జిల్లా సెన్సస్ అధికారులు, డివిజనల్ సెన్సస్ అధికారులు, ఛార్జ్ ఆఫీసర్లు, వారికి సహాయకులుగా వ్యవహరించే డీఏఓలు, ఏఎస్ఓలకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియ ప్రధానంగా రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ , రెండవ దశలో పాపులేషన్ ఎన్యుమరేషన్ ద్వారా జనాభా వివరాలను సేకరిస్తారని వివరించారు. మొదటి దశలో ప్రతి ఇంటిని, నివాస ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎక్కడా ఎలాంటి ఖాళీలు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఛార్జ్ ఆఫీసర్లు క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో వ్యక్తిగతంగా భాగస్వాములై, తమ పరిధిలోని ప్రతి గ్రామం, ఆవాసం, అంతర్గత ప్రాంతం పూర్తిస్థాయిలో కవర్ అయ్యేలా పర్యవేక్షించాలన్నారు.

జనగణనలో కచ్చితత్వానికి ప్రాధాన్యత

జనగణనకు సంబంధించిన ప్రతి ప్రశ్న, ఉపప్రశ్నపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ పరిస్థితులు, నివాస సదుపాయాలు, వంటగది, తాగునీటి సౌకర్యం, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర అంశాలతో కూడిన సుమారు 40 ప్రశ్నలకు సంబంధించి సరైన సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రశ్నావళిలోని ప్రతి అంశంపై సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయిలో తప్పులు దొర్లకుండా చూడాలని ఆదేశించారు. వలసల వివరాల నమోదు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎవరైనా కుటుంబ సభ్యులు వలస వెళ్లినట్లు నమోదు చేసేటప్పుడు కేవలం వలస వెళ్లారని పేర్కొనకుండా, వారు ఎక్కడికి వెళ్లారు, ఏ కారణంతో వెళ్లారు, ఏ విధమైన ఉపాధి కోసం వెళ్లారు, పిల్లలు ఎక్కడ చదువుకుంటున్నారు తదితర పూర్తి వివరాలను సేకరించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా, పరస్పర అనుసంధానంతో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

జనగణన ప్రక్రియను కంప్యూటరైజ్డ్ అప్లికేషన్ల ద్వారా నిర్వహిస్తున్నందున సంబంధిత సాఫ్ట్‌వేర్, డిజిటల్ విధానాలపై అధికారులు, సిబ్బంది పూర్తి పట్టు సాధించాలని కలెక్టర్ సూచించారు. జనాభా ప్రాతిపదికన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లను తగిన సంఖ్యలో నియమించుకోవాలని, అవసరమైతే ప్రాంతాలను విభజించి బాధ్యతలు కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, బ్యాంకింగ్ కోచింగ్ కేంద్రాలతో సమన్వయం చేసుకొని అర్హులైన విద్యార్థుల సేవలను ఎన్యూమరేటర్లుగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు, శిక్షణ, విధుల కేటాయింపు చేపట్టాలని సూచించారు.

స్వీయ జనగణనపై విస్తృత అవగాహన కల్పించాలి

స్వీయ జనగణన (సెల్ఫ్ ఇనుమురేషన్) ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ, గృహ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఇందుకోసం ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి, స్వీయ జనగణనలో భాగస్వాములు అయ్యేలా ప్రోత్సహించాలన్నారు. జనగణన కార్యకలాపాల కోసం మొత్తం బడ్జెట్‌లో సుమారు 40 శాతం నిధులు ఇప్పటికే విడుదల చేసినట్లు, మిగిలిన నిధులు సంబంధిత శాఖ ద్వారా నేరుగా జమ కానున్నట్లు వివరించారు. ఇప్పటికే విడుదలైన నిధులకు సంబంధించిన వినియోగ వివరాలను ఛార్జ్ ఆఫీసర్లు వెంటనే సమర్పించాలని సూచించారు.





శిక్షణకు సమయపాలన తప్పనిసరి

జనగణన శిక్షణా కార్యక్రమాలకు అధికారులు, సిబ్బంది నిర్దేశించిన సమయానికి తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శిక్షణను సాధారణ కార్యక్రమంగా భావించకుండా, జనగణన విజయవంతానికి పునాదిగా గుర్తించాలని సూచించారు. జనవరి నుంచి మార్చి వరకు నిర్వహించనున్న జనగణన కార్యకలాపాలను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, ప్రతి దశను నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జనగణన అనేది కేవలం ఒక వ్యక్తి, ఒక కార్యాలయం లేదా ఒక జిల్లాకు సంబంధించిన కార్యక్రమం కాదని, దేశంలోని సుమారు 147 కోట్ల ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక, ఆర్థిక వివరాలను ప్రతిబింబించే జాతీయ స్థాయి ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా సేకరించే సమాచారం రానున్న పదేళ్లపాటు దేశ అభివృద్ధి, వనరుల కేటాయింపు, ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి అధికారి తన బాధ్యతను దేశాభివృద్ధిలో భాగస్వామ్యంగా భావించి, పూర్తి అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు ఎం. శ్రీనివాసరావు, జి. విష్ణు మాధురి, డి. సుస్మితతో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాచోల్లి డిస్ట్రిబ్యూటర్‌కు నీరేది..? రైతుల ఆగ్రహం..

● ఎల్ఎల్‌సీ కాలువ షట్టర్ల వద్ద ఆందోళన! ● ఐదు రోజులుగా నీటి కోసం ఎదురుచూపులు.. ● ఆరుతడి పంటలకూ అందని సాగునీరు.. ● రైతుల ఆందోళనతో రంగంలోకి దిగిన అధికారులు, పోలీసు సిబ్బంది

హోళగుంద పల్లె వెలుగు నవంబర్:17 తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్‌సీ) నుంచి ప్రవహించే హాచోల్లి డిస్ట్రిబ్యూటర్‌కు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నీటి కోసం ఎల్ఎల్‌సీ కాలువ వద్దకు చేరుకున్న రైతులు షట్టర్లను దించి నిరసనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

గత ఐదు రోజులుగా హాచోల్లి డిస్ట్రిబ్యూటర్ పరిధిలోని చివరి ఆయకట్టు పిల్లకాలువలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ నీటిని మధ్యలోనే చెరువులకు మళ్లించడంతో చివరి ఆయకట్టు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే ఆరుతడి పంటలకు సైతం సక్రమంగా నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని వాపోయారు.

రైతులు షట్టర్లు దించడంతో బోర్డు అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి షట్టర్లు ఎత్తేందుకు ప్రయత్నించారు. అయితే తమకు సాగునీరు అందకుండా ఎలా షట్టర్లు ఎత్తుతారని రైతులు అధికారులను నిలదీశారు. చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన నేపథ్యంలో అధికారులు పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు.

నీరు అందకపోతే రైతుల పరిస్థితి ఏంటి?

పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు అందకపోతే రైతులు అప్పులపాలై తీవ్రంగా నష్టపోతారని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఏం చేయాలని ప్రశ్నించారు. నీరు అందించకపోతే రైతులు విషం తాగాల్సిన దుస్థితి వస్తుందని కన్నీటిపర్యంతమయ్యారు.

మరోవైపు అధికారులు మాట్లాడుతూ కర్ణాటక కోటా నీటిని మాత్రమే నిలిపివేశారని, ఆంధ్రప్రదేశ్ కోటా కింద ఈ నెల 20వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరాను పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

అయితే అధికారులు చెబుతున్న నీరు చివరి ఆయకట్టు వరకు చేరకపోతే తమ పంటలను ఎలా కాపాడుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా హాచోల్లి డిస్ట్రిబ్యూటర్ చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బాల్యవివాహాల నిర్మూలన, దత్తతపై అవగాహన కార్యక్రమం

దొర్నిపాడు నంబర్ 17 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని అమ్మిరెడ్డి నగర్ గ్రామంలో గల కస్తూర్బాబాలికలవిద్యాలయంలోమంగళవారంమహిళా అభివృద్ధి మరియు శిశు





సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగంఆధ్వర్యంలో ఎస్ఓ జయమణిఅధ్యక్షతన బాల వివాహముక్తభారత్ కార్యక్రమంతో పాటు, నవంబర్ నెల దత్తత అవగాహన మాసం సందర్భంగా నిర్దీత షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్యవివాహ నిరోధక చట్టం, పోక్సో (గూజూూ) చట్టం, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, బాలికల విద్య ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఆఫీసర్ ఏ. దర్గయ్య మాట్లాడుతూ, బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తును, విద్యను, ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వివరించారు. 18 సంవత్సరాలు నిండే వరకు బాలికలకు వివాహం చేయకూడదని, ప్రతి బాలిక ఉన్నత విద్యను అభ్యసించి తన లక్ష్యాలను సాధించాలని సూచించారు.అవుట్‌రీచ్ వర్కర్ సి. లక్ష్మీదేవి మాట్లాడుతూ, బాలికలు ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రభాకరమ్మ మాట్లాడుతూ, ప్రతి బాలిక మంచివిద్యను అభ్యసించడంతో పాటు ఆరోగ్యంపైశ్రద్ధ వహించాలని సూచించారు అనంతరం బాల్యవివాహాల నిర్మూలపై ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ జయమణి, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఏ. దర్గయ్య, అవుట్‌రీచ్ వర్కర్ సి. లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రభాకరమ్మ, జనూ కౌన్సిలర్ రజియా, పాఠశాల సిబ్బంది, ఒక అంగన్‌వాడీ వర్కర్ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకం పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి.

● ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించి సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలి. ● డోన్, ఆత్మకూరు డివిజన్లలో మిగిలిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ● జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు యూఎల్ఏ మోడల్ కింద చేపట్టిన సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు పనులను వేగవంతం చేసి, ఈ నెలాఖరులోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ సోలార్ పీఎం సూర్యఘర్ పథకం అమలుపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ డివిజన్ల వారీగా ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ మిగిలిన



నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల పురోగతిని సమీక్షించారు. నంద్యాల డివిజన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. డోన్ డివిజన్‌లో మొత్తం 9,555 లక్ష్యాలకు గాను 5,427 పనులు, ఆత్మకూరు డివిజన్‌లో 10,912 లక్ష్యాలకు గాను 5,281 పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించి, ఈ నెలాఖరులోగా నిర్దేశిత లక్ష్యాలన్నింటినీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇ శ్రీనివాసరెడ్డి, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు ఈఈలు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన జాయింట్ కలెక్టర్

హోళగుంద పల్లె వెలుగు నవంబర్:17 గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో హోళగుంద



మండలంలో నామినేషన్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని సమ్మతగేరి, హోళగుంద, ఎల్లార్తి గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లు, ఎన్నికల విధుల నిర్వహణ, నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ పర్యటనలో హోళగుంద మండల తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

ట్యూమర్ బాధితురాలికి పూర్వపు విద్యార్థుల సాయం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 17: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న



పార్నపల్లె గ్రామానికి చెందిన ట్యూమర్ బాధితురాలు శ్రీజ సునందినికి పూర్వపు విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. పార్నపల్లె గ్రామానికి చెందిన కె.వి జనార్ధన శాస్త్రి అనే పూజారి కూతురు శ్రీజ సునందిని కి రెండుసార్లు బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ జరిగింది. ఈ కారణంగా పూజారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడింది. ఈ విషయాన్ని గుర్తించిన 2001 వ సంవత్సరం పదవ తరగతి పూర్వపు విద్యార్థులు స్పందించారు. పార్నపల్లె గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థి సాయికుమార్ తోటి విద్యార్థులతో కలిసి 16 500 రూపాయలు వసూలు చేశారు. పలు ఫైనాన్స్ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్న శంకర్ ,గోవర్ధన్ ,మదన్మోహన్ ,లింగమయ్య, గోకారి తదితరులు మరో 23 వేల రూపాయలు వసూలు చేశారు. వసూలైన మొత్తం సొమ్మును జనార్ధన శాస్త్రి సోదరుడైన ప్రసన్నకుమార్ కు మంగళవారం అందజేశారు.

వైసీపీకి మరో భారీ షాక్,,,,,

టీడీపీ వైపు వెల్లువెత్తిన వలసలు.....,,

నాలుగు గ్రామాల నుంచి భారీగా చేరికలు,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 17 ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్





రెడ్డి సమక్షంలో కలుగొట్ల, గాజులదిన్నె, పెద్ద నెలటూరు, నాగలదిన్నె గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బి.వి జయనాగేశ్వర్ రెడ్డి వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే నాయకత్వంపై నమ్మకంతో పెద్ద సంఖ్యలో దాదాపు 120 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేస్తున్నాయని ఈ చేరికలు మరోసారి నిరూపిస్తున్నాయి. గ్రామాల వారీగా పార్టీలో చేరిన ప్రముఖులు కలుగొట్ల: కారం నాగేష్ గౌడ్, ఆది శేషు గౌడ్, చిన్న ఉరుకుందు, నరసప్ప, వీర గోవింద్ గౌడ్, చిన్న నాగేష్.బి గాజులదిన్నె: చంద్ర, రత్నమయ్య, కర్రెన్న, సోమన్న తదితరులు.బి పెద్ద నెలటూరు: కనకవేటి రామకృష్ణారెడ్డి, కె. పరమేష్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి. నాగలదిన్నె: డి. ఖాసీం, స్వామి, గణేష్, చాంద్, రాజు, ఎర్రన్న, కాశీనాథ్ తదితరులు.

ముగిసిన నామినేషన్ల పర్వం

-సర్పంచ్ స్థానాలకు 64 -వార్డుసభ్యులకు 230 నామినేషన్లు దాఖలు

దొర్నిపాడునవంబర్ 17 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని 11 గ్రామ



పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల చివరి రోజు మొత్తం 64 మంది సర్పంచ్ అభ్యర్థులుగా 230 మంది వార్డు సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు ,ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ దొర్నిపాడుకు సర్పంచ్ అభ్యర్థులుగ 10 రామచంద్రపురం,4 కొండాపురం 6 ,అమ్మి రెడ్డి నగర్ నగర్ 2 అర్జునపురం 6, కొత్తపల్లి 1 గోవిందిన్నే 9 , గుండు పాపల,5 కిష్టిపాడు 10 చాకరాజువేముల 1, బురారెడ్డి పల్లె 8,మంది సర్పంచ్ అభ్యర్థులుగ చివరి రోజు నామినేషన్ దాఖలు చేసేట్లు ఆమె తెలిపారు, ఈనెల 19వ తేదీన మండల అధ్యక్షులు ఉపాధ్యక్షులు,కోఆప్షన్ నెంబర్ ఎంపికకార్యక్రమము స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉంటుందని ఆమె తెలిపారు

గ్రంథాలయాల ఉపయోగాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బనగానపల్లె , నవంబర్ 17, పల్లెవెలుగు పట్టణంలోని తెలుగుపేట ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాల ఉపయోగాలు పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు మంగళవారం పట్టణంలోని తెలుగు పేట ప్రాథమిక పాఠశాలలో 59వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా నాలుగవ రోజు విద్యార్థులకు గ్రంథాలయ ఉపయోగాలు గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది అరుణ గీతామని, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎన్. ప్రతాప్, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీదేవి, పుష్పలత పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.

●■లబ్ధిదారుల వారీగా ప్రగతిని సమీక్షించి, పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. ● పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి. ● జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి ఎం ఏ వై 1.0, 2.0 అర్బన్), పీఎం జన్మన్ తదితర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ గృహ నిర్మాణ పథకాల అమలు తీరు, పురోగతిపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాల వారీగా లబ్ధిదారుల ఎంపిక, గృహ నిర్మాణాల ప్రారంభం, నిర్మాణ పురోగతి, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పథకం కింద లబ్ధిదారుల వారీగా గృహ నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని వారు, రుణాలు పొందని లబ్ధిదారులను గుర్తించి, వారి సమస్యలను విశ్లేషించి నిర్మాణాలు ప్రారంభించేలా



అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను ఏ విధంగా పూర్తి చేయాలనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, రెండు రోజుల్లోగా నివేదికలు సమర్పించాలని జెసి ఆదేశించారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న, ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని, నిర్మాణాలు ప్రారంభించిన ప్రతి ఇంటి పనులు వేగవంతంగా సాగేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. ప్రత్యేకంగా పీఎం జన్మన్ పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణాల గ్రౌండింగ్, పూర్తిచేసే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ సూచించారు. ఈ పథకం నిర్దిష్ట కాలపరిమితితో కూడుకున్నది కావడంతో, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే, తదుపరి సమీక్షా సమావేశానికి ప్రతి లబ్ధిదారుడి గృహ నిర్మాణ స్థితిగతులతో కూడిన వివరాల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు సంబంధించిన సమగ్ర ప్రగతి నివేదిక (అబ్‌స్ట్రాక్ట్)ను రెండు రోజుల్లోగా సమర్పించాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధికి గ్రీన్‌కో సంస్థ విస్తృత చేయూత

-విద్య, వైద్యం, తాగునీరు, పర్యావరణ పరిరక్షణతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ

పాణ్యం నవంబర్ 17 పల్లె వెలుగు : స్థానిక




ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా గ్రీన్‌కో సంస్థ పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతోంది. విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, పశు పోషణతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా తనవంతు సహకారం అందిస్తోంది. కరోనా సమయంలో వైద్య రంగానికి అండగా నిలిచిన గ్రీన్‌కో సంస్థ కర్నూలులో సుమారు రూ. 1.5 కోట్ల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు 14 గ్రామాలకు ఆక్సిజన్ సదుపాయాలు కల్పించింది. విద్యాభివృద్ధిలో భాగంగా పిన్నాపురం, బ్రాహ్మణపల్లె, గుమ్మితం తండా, హుస్సేనాపురం గ్రామాల్లో విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తోంది. గ్రామీణ పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ హుస్సేనాపురం, కాల్వ, బ్రాహ్మణపల్లె, శకునాల, గని ప్రాంతాల్లో చెత్త నిర్వహణ కార్యక్రమాల కోసం సుమారు రూ. 15 లక్షలు కేటాయించింది. అదేవిధంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 56 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి నిర్వహిస్తోంది. నంద్యాలలోని చిన్న చెరువు అభివృద్ధికి కూడా సంస్థ సహకారం అందించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోళ్లపాడు ప్రాంతంలో అరుదైన బస్టార్డ్ పక్షుల సంరక్షణకు సుమారు రూ. 14 కోట్లతో కార్యక్రమాలు చేపడుతోంది. ఈ కార్యక్రమాల ద్వారా 240 పక్షుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఆసక్తి ఉన్న రైతులకు సహకారం అందించడంతో పాటు పశుపోషణ అభివృద్ధికి కూడా ప్రోత్సాహం కల్పిస్తోంది. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో సుమారు 900 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించే కార్యక్రమాలను చేపడుతోంది. పరిశ్రమలకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను యువతలో పెంపొందించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తోంది. ఈ విధంగా పారిశ్రామిక అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం, వ్యవసాయం, పర్యావరణం, ఉపాధి రంగాల్లో గ్రీన్‌కో సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్థానిక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయి.

అధికారం కోసమా..? అభివృద్ధి కోసమా..?

-గజ్జహల్లిలో సర్పంచ్ బరిలో 14 మంది..
-3,274 మంది ఓటర్ల తీర్పుపై ఉత్కంఠ!
-మూడు పోలింగ్ బూత్‌లు.. 12 వార్డులు..
-గ్రామంలో ఆసక్తికరంగా మారిన రాజకీయాలు!

హోళగుంద పల్లె వెలుగు నవంబర్:17 మండల



పరిధిలోని గజ్జహల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి. సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఏకంగా 14 మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో గ్రామ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గ్రామంలో మొత్తం 3,274 మంది ఓటర్లు ఉండగా, మూడు పోలింగ్ బూత్‌లు, 12 వార్డులు ఉన్నాయి. ఒకే సర్పంచ్ పదవికి ఇంతమంది పోటీ పడుతుండటం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఒకప్పుడు గ్రామ రాజకీయాలంటే ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధి, ప్రజాసేవ ప్రధాన అంశాలుగా ఉండేవి. కానీ ప్రస్తుతం గజ్జహల్లిలో రాజకీయ పరిస్థితులు ఆశామాషీగా మారాయన్న చర్చ వినిపిస్తోంది. గ్రామ జనాభా లెక్కలు, గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలపై కనీస అవగాహన లేని వారు సైతం సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారంటూ గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు.

మరోవైపు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమంటూ అభ్యర్థులు హామీల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రచార పోస్టులు, సందేశాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

అయితే ఇంతమంది అభ్యర్థులు బరిలో నిలవడం వెనుక నిజంగా గ్రామ అభివృద్ధిపై ఉన్న ఆసక్తేనా? లేక సర్పంచ్ కుర్చీపై ఉన్న అధికార కాంక్షేనా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించడం సులువే కానీ, గ్రామంలోని సమస్యలపై అవగాహన ఉండి వాటిని పరిష్కరించే బాధ్యత ఎంతమందికి ఉందన్నదే ఇప్పుడు చర్చనీయాంశం.

మాటలతో హామీలు ఇవ్వడం కాదు.. గ్రామ సమస్యలపై అవగాహన, అభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళిక, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

మొత్తం 3,274 మంది ఓటర్లు తమ ఓటు హక్కుతో ఎవరికి పట్టం కడతారు? 14 మంది అభ్యర్థుల్లో ప్రజల మద్దతు ఎవరికి లభిస్తుంది? అన్నది వేచి చూడాలి. అధికారం కోసమా..? అభివృద్ధి కోసమా..? హామీలకే పరిమితమా..? ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమా..? గజ్జహల్లి ఓటర్ల తీర్పుతో తేలనుంది!



ప్రజల ఆశీర్వాదంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం.

- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి,
మహిళా బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవి సింగారెడ్డి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల





గడ్డపై కొత్త విష సంస్కృతి అంతం కావాలని, తిరిగి మంచి రోజులు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో శిల్పా కుటుంబం ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటూ విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. స్థానిక శిల్పా సేవాసమితి కార్యాలయంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా లబ్ధిదారులైన 121 మంది మహిళలకు మొత్తం 21లక్షల77 వేల రూపాయల విలువైన ఆర్థిక సహాయం (చెక్కులను) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి, బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవిసింగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మరియు నాగిని రవిసింగారెడ్డి మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా శిల్పా కుటుంబం నంద్యాల ప్రజలకు ఎలాంటి ఆశలు ఆశించకుండా నిస్వార్థంగా సేవలు అందిస్తోందని గుర్తుచేశారు. అయితే, తాము చేస్తున్న మంచిని ఓర్వలేక, అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్న కొందరు వ్యక్తులు తమ 'శిల్పా సహకార్ సూపర్ మార్కెట్' సేవలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఖాళీ చేయించిన ఆ స్థానంలో కేవలం ఆరు నెలల పాటు ఒక్క షాప్‌ను మాత్రమే నిర్వహించడం గమనార్హమని, ఇది తమపై ఉన్న రాజకీయ కక్ష కాదా? అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో శిల్పా కుటుంబం చేస్తున్న సేవా కార్యక్రమాలను అడ్డుకున్న వారికి ప్రజలు తగిన తీర్పునిచ్చి బుద్ధి చెప్పారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఎప్పుడూ మంచి చేసేవారికే పట్టం కడతారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శిల్పా కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే అది కేవలం నంద్యాల ప్రజల దీవెనలు, ఆశీర్వాదాల వలనేనని తెలిపారు. ఈ సంక్షేమ ప్రయాణంలో భాగంగానే శిల్పా మహిళా సహకార్ బ్యాంకును పునఃప్రారంభించి, మహిళలకు రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. నంద్యాల ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు శిల్పా కుటుంబం మరింత ఉత్సాహంగా ముందుకెళు ్తందని స్పష్టం చేశారు.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులకు
త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి.

జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులకు



త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డి ఐ ఈ పీ సి) సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల ద్వారా అందిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న అనుమతుల పై సమీక్షిశీచిన జిల్లా కలెక్టర్. ఈ సమావేశంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిశీలన, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు, వివిధ రాయితీల మంజూరు అంశాల పలు సూచనలు చేశారు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు కోరిన అనుమతులను కోలతలు లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. మొత్తం 53 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా 40 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయగా, 13 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, పరిశ్రమల అభివృద్ధి అధికారులు , డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది రోజుల్లోనే రూ.5.25 లక్షల సాయం.

-స్వప్న న్యాయకర్ మల్లప్ప సేవా కార్యక్రమాలు.
-ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం..
-సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపల్ చర్యలు చేపట్టడం, జైహింద్ నుంచి డీఎస్పీ చైర్పర్సన్ శ్రీమతి స్వప్న న్యాయకర్ మల్లప్ప బంగ్లా వరకు సొంత నిధులతో డ్రైనేజీ



బాధ్యతలు చేపట్టిన పది రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టి, వరుసగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని జనసేన పార్టీ నాయకులు యం. పులి రాజు అన్నారు.
చైర్పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇప్పటివరకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా మొత్తం రూ. 5.25 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఇందులో తహేర్ష ఖాద్రి దర్గా అభివృద్ధికి రూ. 3.25 లక్షలు, ధనాపురంలో పంట నష్టపోయిన మిరప రైతుకు రూ. 1 లక్ష, అంబేద్కర్ నగర్ అభయ ఆంజనేయ స్వామి ఆలయానికి రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.
అదేవిధంగా ఖాజీపురాలో ప్రమాదకర స్థితిలో ఉన్న నిరుపేద మహిళ ఇంటి మరమ్మతులకు పూడికతీత పనులు నిర్వహించడం, ఖాజీపురాలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను వేగవంతం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు.
ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఆదోని పట్టణ అభివృద్ధికి స్వప్న న్యాయకర్ మల్లప్ప చేస్తున్న కృషి ప్రశంసనీయమని యం. పులి రాజు పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజల పట్ల తన నిబద్ధతను చాటుకుంటున్నారని అన్నారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ పి.ఎస్. జైరామ్, రాము, వెంకట రాముడు, అయ్యప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ మండలం 100 నామినేషన్లు

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 17, పల్లె వెలుగు ఆళ్లగడ్డ మండల పరిధిలోని 17 గ్రామ పంచాయితీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు మంగళవారం నామినేషన్ల సమయం ముగిసే నాటికి సర్పంచ్ లకు 100, వార్డు సభ్యులకు 387 నామినేషన్లు ధాఖలయ్యాయని ఆళ్లగడ్డ మండల ఎన్నికల అధికారి నూర్జహాన్ తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకారణలో భాగంగా మొదటి రోజు సర్పంచ్ లకు 21, వార్డు సభ్యులకు 54 నామినేషన్లు, రెండవరోజు సర్పంచ్ లకు 46, వార్డు సభ్యులకు 164 నామినేషన్లు, మూడవ రోజు సర్పంచ్ లకు 33, వార్డు సభ్యులకు 169 నామినేషన్లు ధాఖలయ్యాయి. మండలం లోని 17 గ్రామ పంచియితీలకు నామినేషన్ల స్వీకారణ ముగిసిందన్నారు. బుధవారం మండలంలోని అహోబిలం, ఆర్ కృష్ణాపురం, కోట కందుకూరు, ఎస్ లింగం దిన్నె, ఓబులంపల్లి, బత్తలూరు ఆరు క్లస్టర్ లలో స్క్రుట్నీ జరుగుతుందని నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి పలు సూచనలు చేసినట్లు ఆమె తెలిపారు.



చౌడేశ్వరి దేవస్థానంలో హుండీ లెక్కింపు

బనగానపల్లె, నవంబర్ 17, పల్లెవెలుగు మండలంలోని శ్రీ చౌడేశ్వరి దేవతా దేవస్థానంలో





హుండీని లెక్కించారు మంగళవారం చౌడేశ్వరి దేవస్థానం లో జులై 24వ తేదీ నుండి ఈనెల 17వ తేదీ వరకు హుండీలో వచ్చిన నగదును ఇతర కానుకలను లెక్కించారు. హుండీని కౌంటింగ్ చేయగా 32,31,488/- రూపాయల నగదు, 34 గ్రాముల 800 మిల్లీ గ్రాములబంగారు వస్తువులు, 490 గ్రాముల 200 మిల్లీ గ్రాములు వెండి వస్తువులు లభించాయి.అన్నదాన సత్రం హుండీ లెక్కింపు ద్వారా 76,826/- రూపాయలు వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ , కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి , బనగానపల్లె డివిజన్ తనిఖీ అధికారి పి.హరిశ్చంద్ర రెడ్డి,ఆలయ సిబ్బంది, నందవరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, నంద్యాల బాలాజీ సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక మొదటి సోమవారం భక్తితో భజన కార్యక్రమం

దొర్నిపాడు నవంబర్ 17 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైనదొర్నిపాడు గ్రామంలో



కొలువై వెలసిన కాశీ విశ్వేశ్వర దేవాలయం నందు కార్తీకమాసంలో వచ్చే మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని గ్రామ ప్రజలు కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు అత్యంత పవిత్రమైన కార్తీకమాసంలో శివునికి ఆలయ పూజారి దోరణాల భార్గవ శర్మ అభిషేకాలు,పూజలు,అర్చన లు చేస్తున్నారు,మహిళలు దీప కాంతులను శివాలయంలో వెలిగించిభక్తినిచాటుకుంటున్నారు, కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో భజన చేసే భక్తులతో పాటు పుర ప్రజలకు అల్పాహారాన్ని వడ్ల వీరభద్ర ఆచారిఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భార్గవ శర్మ మాట్లాడుతూ కార్తీకమాసంలో పుణ్యస్థలాలు ఆచరించి ఉదయమే శివుని అభిషేకంలో పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాలని ఆయన ప్రజలను కోరారు,

విద్యార్థినీలకు సైకిళ్ళ పంపిణీ

బనగానపల్లె, నవంబర్ 17, పల్లెవెలుగు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత



పాఠశాల విద్యార్థినీలకు స్టేట్ బ్యాంకు సిబ్బంది సైకిళ్లను పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్టేట్ బ్యాంకు సిబ్బంది ఆరు నుండి పదవ తరగతి చదువుతున్న దూరప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చే ఐదు మంది విద్యార్థినిలకు కార్పొరేట్ సోసియో రెస్పాన్సిబిలిటీ లో భాగంగా ఉచితంగా ఐదు సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, స్టేట్ బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బనగానపల్లె చరిత్ర, వైభవం ఉట్టిపడేలా ముఖద్వారాల ఆధునికీకరణ- మంత్రి బీసీ

బనగానపల్లె, నవంబర్ 17, పల్లెవెలుగు బనగానపల్లె పట్టణానికి ఉన్న చారిత్రక నేపథ్యం, ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఆ చరిత్ర, సంస్కృతి, వైభవం ఉట్టిపడేలా పట్టణ



ముఖద్వారాల ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో చేపడుతున్న ముఖద్వారాల ఆధునికీకరణ పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరికీ బనగానపల్లె చారిత్రక విశిష్టత, వైభవం ప్రతిబింబించేలా ముఖద్వారాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణం వైపు వచ్చే సందర్శకులను ఆకట్టుకునేలా ఆధునిక హంగులు, సుందరమైన డిజైన్లతో ముఖద్వారాలను తీర్చిదిద్దానున్నట్లు తెలిపారు. కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా బనగానపల్లెకు ప్రత్యేక గుర్తింపునిచ్చేలా ఈ ముఖద్వారాలను అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి పంచాయితీ ఎన్నికలకు నామినేషన్లు





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలో నేటి నుంచి రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు మొదలవుతుందని ఎంపీడీవో మహమ్మద్ దౌల తెలిపారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్టేజ్ వన్ ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎన్నికలకు స్టేజ్ వన్ ఎన్నికల అధికారులను నియమించారన్నారు. ఈనెల 18, 19, 20 తేదీలలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలవుతుందని,మొత్తం 13 గ్రామ పంచాయతీలకు, 140 వార్డులకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.మండలంలోని తిమ్మాపురం, మహానంది, అబ్బీపురం గ్రామలకు (తిమ్మాపురం)తమ్మడపల్లె, బుక్కాపురం, అల్లినగరం, బొల్లవరం గ్రామాలకు (తమ్మడపల్లె) సీతారామపురం మసీదుపురం, నందిపల్లె, గ్రామాలకు (సీతారామపురం) గాజులపల్లె, గోపవరం, ఆర్ ఎస్ గాజులపల్లె గ్రామాలకు (గాజులపల్లె)లో నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాటు చేశామన్నారు.21న స్నూటి, 24న అభ్యర్థులకు అందరికీ గుర్తింపులు, 29న ఎన్నికలు నిర్వహించి అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ యార్డుల నిర్వహణ, రెన్యూవల్‌పై జిల్లా కలెక్టర్ సమీక్ష.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లాలోని ఇసుక స్టాక్ యార్డులలో ఉన్న నిల్వలు, స్టాక్ యార్డుల రెన్యూవల్ అవసరం తదితర అంశాలపై సబ్ కలెక్టర్ మనీషా, అడిషనల్ ఎస్పీ ఖాదర్బాషా తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నలుగురు (04) ఇసుక డిపో యజమానులతో జిల్లా కలెక్టర్ చర్చిస్తూ, నంద్యాల జిల్లాలో ఇసుక సరఫరాపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం (పాజిటివ్ పబ్లిక్ ప్రిసెప్షన్) తక్కువగా ఉండటానికి గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన డిపో యజమానులు కర్నూలు జిల్లాలో అప్పుడప్పుడు ఇసుక లభ్యత లేకపోవడంతో దాడిపల్లి, కమలాపురం, జమ్మలమడుగు తదితర దూర ప్రాంతాల నుంచి ఇసుకను తెప్పించుకుంటున్నామని, దీనివల్ల ఇసుక ధరలు మరియు నిల్వల్లో వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి తెలిపారు. రాబోయే రోజుల్లో ఇసుక సరఫరాపై ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి మాట్లాడుతూ, ఆళ్లగడ్డ ఇసుక డిపోలో ఇసుక నిల్వలు నిర్వహించడం లేదని, కమిటీ నిబంధనలు పాటించడం లేదని, జిల్లా స్థాయి కమిటీ సమావేశాలకు కూడా హాజరు కావడం లేదని వివరించారు. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డ ఇసుక డిపోను తదుపరి రెన్యూవల్ చేయాల్సిన అవసరం లేదని కమిటీ సభ్యులకు తెలియజేశారు. సమావేశంలో నంద్యాల, బనగానపల్లి సిండికేట్లు మరియు ఆత్మకూరు ఇసుక డిపోలను తదుపరి ఒక సంవత్సరం కాలానికి రెన్యూవల్ చేయాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ తీర్మానించింది. అలాగే ఆళ్లగడ్డ ఇసుక డిపోను తదుపరి రెన్యూవల్ చేయకూడదని నిర్ణయించింది

ఆదిత్య రెడ్డి నేతృత్వంలో షేక్ అర్షియా
నామినేషన్‌కు భారీ ర్యాలీ

పోరుమామిళ్ల, నవంబర్ 17 (పల్లె వెలుగు): పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా షేక్ అర్షియా నామినేషన్ దాఖలు కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సందడి మధ్య సాగింది. ఎన్నికల రథసారథి దేవసాని ఆదిత్య రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.



పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో దేవసాని ఆదిత్య రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ముందుండి కార్యక్రమాన్ని నడిపించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, మాజీ పంచాయతీరాజ్ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు సీఎం భాష, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లి నరసింహులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.వీరితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళలు, అభిమానులు ర్యాలీలో పాల్గొని షేక్ అర్షియా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ కార్యాలయం నుంచి నామినేషన్ కేంద్రం వరకు సాగిన ర్యాలీతో పోరుమామిళ్లలో రాజకీయ సందడి నెలకొంది. దేవసాని ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పాల్గొనడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

నంద్యాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్
పదవి మా కుటుంబానికి కేటాయించాలి

టీడీపీ అధిష్ఠానానికి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి గడ్డం రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి

బనగానపల్లె ,నవంబర్ 17, పల్లెవెలుగు నంద్యాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పదవిని తమ కుటుంబానికి కేటాయించాలని కోవెలకుంట్ల జడ్పీటీసీ గడ్డం నారాయణమ్మ భర్త, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు గడ్డం రామకృష్ణారెడ్డి పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం 1982 నుంచి తమ కుటుంబం పార్టీకి అంకితభావంతో పనిచేస్తోందని ఆయన తెలిపారు. పార్టీ అభ్యర్థి ఎవరైనా సరే, వారి గెలుపే లక్ష్యంగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ పార్టీ విజయానికి కృషి చేశామని పేర్కొన్నారు. పదవులు రాకపోయినా, రాజకీయంగా ఎలాంటి ప్రయోజనాలు దక్కకపోయినా పార్టీని వీడకుండా నిబద్ధతతో కొనసాగామని తెలిపారు.



2009లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, అవుకు మండలాలు బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో, 2011లో బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తమ కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యత లభించిందని రామకృష్ణారెడ్డి తెలిపారు.మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆశీస్సులతో 2014లో తన సోదరుడు గడ్డం నాగేశ్వరరెడ్డికి కోవెలకుంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి లభించిందని, ప్రస్తుతం తన సతీమణి గడ్డం నారాయణమ్మకు కోవెలకుంట్ల జడ్పీటీసీగా అవకాశం దక్కిందన్నారు.కోవెలకుంట్ల ప్రాంత ప్రజల్లో తమ కుటుంబం పట్ల సానుకూల అభిప్రాయం ఉందని, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా చేసిన సేవలను గుర్తించి ఈసారి నంద్యాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పదవిని గడ్డం నారాయణమ్మకు కేటాయించాలని కోరారు.మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చొరవతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, యువనాయకుడు నారా లోకేష్ మద్దతు లభిస్తే తమ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్న పూర్తి నమ్మకం ఉందని గడ్డం రామకృష్ణారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడిన తమ కుటుంబానికి సముచిత గుర్తింపు కల్పించి, గడ్డం నారాయణమ్మకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పదవి అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో
పనిచేస్తే అన్ని స్థానాల్లో విజయం -మంత్రి బీసీ

బనగానపల్లె , నవంబర్ 17, పల్లెవెలుగు సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంచాయతీ ఎన్నికల్లో కూటమి నాయకులు, పేర్కొన్నారు .మంగళవారం మండలంలోని కాపులపల్లె ఫంహౌస్‌లో బనగానపల్లె మండలం, పట్టణానికి చెందిన ఎన్డీఏ కూటమి నాయకులతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న సానుకూలత పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రతిబింబిస్తుందన్నారు.గ్రామస్థాయిలో కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



నవంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ఏర్పాట్లు.

ఫార్మ్ పెండింగ్ లేకుండా పరిష్కరిస్తున్నాం.
ఓటు హక్కు లేని వారు ఫార్మ్-6 ద్వారా దరఖాస్తుకు అవకాశం
జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) జాబితాను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఈ నెల 30న ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, వైఎస్సార్సీసీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, బిజెపి కె.చంద్రశేఖర్, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మదిన్నావలి తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖచ్చితమైన తుది ఓటర్ల జాబితాను ఈ 30వ తేదీన ప్రచురించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ వివరించారు. అదే విధంగా ఫార్మ్ పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేశామని డిఆర్ఓ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏ ఓటర్ అయినా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమయంలో వారి ఓటు హక్కు కోల్పోయినట్లయితే తిరిగి వారి ఓటు హక్కును ఫామ్-6 ద్వారా పొందే అవకాశం ఉందన్న విషయాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పించాలని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఓటర్ల సమస్యల నివృత్తి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన "జాతీయ ఫిర్యాదుల సేవ పోర్టల్" (నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్) మరియు "బుక్ ఏ కాల్ విత్ బిఎల్ఓ" ద్వారా ఓటర్లకు ఉన్న సమస్యలను పరిష్కరించడం జరిగిందని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ వివరించారు. అదే విధంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ తెలిపారు.

మహానందిలో భద్రత ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లను నంద్యాల ఏఎస్పీ సుస్మిత పరిశీలించారు. మంగళవారం ఆమె క్షేత్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించి ఎస్సై ఎల్. శివాంజల్, ఏఈవో మధుకు పలు సూచనలు చేశారు. కార్తీక పౌర్ణమి, సోమవారాల్లో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మహానంది క్షేత్రంలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.







దీర్ఘకాలిక గాయాలకు ఆధునిక వైద్యం



-అత్యాధునిక చికిత్సలతో సేవలందిస్తున్న ప్లాస్టిక్ సర్జన్ డా. రంగ కిషోర్

- మైక్రోస్కోపిక్ క్లీనింగ్, వ్యాక్ (వి ఏసి) డ్రెస్సింగ్‌లతో వేగవంతమైన ఉపశమనం
- ఇన్ఫెక్షన్ ముప్ప లేకుండా, అతి తక్కువ మచ్చలతో మెరుగైన ఫలితాలు
- "మీ ఆరోగ్యం మా ప్రాధాన్యత" నినాదంతో రోగులకు భరోసా కల్పిస్తున్న వైద్యుడు

నంద్యాల పల్లె వెలుగు నవంబర్ 17:-వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక విప్లవం ఎంతో మంది ప్రాణాలను, జీవితాలను నిలబెడుతోంది. అందులోనూ చాలా కాలంగా నయం కాక ఇబ్బంది పెట్టే దీర్ఘకాలిక గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ విభాగం ద్వారా సరికొత్త పరిష్కారాలు లభిస్తున్నాయి. ఈ కోవకే చెందిన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డా. రంగ కిషోర్ (MBBS, MS, MCh - Plastic Surgery) రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించు కుంటున్నారు

ఆధునిక పద్ధతులతో శాశ్వత చికిత్స

సాధారణంగా దీర్ఘకాలిక గాయాలు తగ్గడానికి చాలా కాలం పడుతుంది, అంతేకాకుండా ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది.



అయితే, డా. రంగ కిషోర్ ఇటువంటి క్లిష్టమైన కేసులను 'మైక్రోస్కోపిక్ క్లీనింగ్ ఆఫ్ వూండ్' (Microscopic Cleaning of Wound) మరియు 'VAC డ్రెస్సింగ్' (Vacuum-Assisted Closure) వంటి అత్యాధునిక పద్ధతులను విజయవంతంగా ఉపయోగిస్తున్నారు.

ఖచ్చితమైన శుభ్రత - మెరుగైన ఫలితాలు:

ఖచ్చితమైన శుభ్రత - మెరుగైన ఫలితాలు:

సూక్ష్మదర్శిని (మైక్రోస్కోప్) సహాయంతో గాయాలను సూక్ష్మస్థాయిలో శుభ్రం చేయడం వల్ల, క్రిములు పూర్తిగా తొలగిపోవడంతో పాటు గాయం త్వరగా మానడానికి (బెటర్ హీలింగ్) సహాయపడుతుంది. దీనివల్ల మచ్చలు కూడా చాలా కనిష్టంగా (మినిమల్ స్కార్స్) ఉంటాయి.

విఏసి టెక్నాలజీతో వేగవంతమైన నయం:



వాక్యూమ్ అసిస్టెడ్ క్లోజర్ (విఏసి) డ్రెస్సింగ్ విధానం ద్వారా గాయం త్వరగా మానడాన్ని (అసిల రేట్స్ హీలింగ్) వేగవంతం చేయడమే కాకుండా, ఇన్ఫెక్షన్ సోపకుండా అత్యంత సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుంది.

రోగి ఆరోగ్యమే మా ప్రాధాన్యత

"మీ ఆరోగ్యం మా ప్రాధాన్యత" (యువర్ హెల్త్ అవర్ ప్రయారిటీ) అనే నినాదంతో, రోగి బాధను అర్థం చేసుకుని, వారిని త్వరగా కోలుకునేలా చేయడంలో డా. రంగ కిషోర్ చూపుతున్న వైద్య నిబద్ధత ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. సాంకేతిక పరిజ్ఞానాన్ని, అంకితభావాన్ని జోడించి ఆయన అందిస్తున్న ఈ వైద్య సేవలు ఎంతో మంది రోగుల పాలిట వరంగా మారుతున్నాయి.

విద్యా కమిటీ చైర్మన్ కృషి అభినందనీయం .....

కేజీబీవీ ప్రిన్సిపల్ శైలజ.....

పాఠశాలకు రెండు కుట్టు మిషన్ల అందజేత.....

నందవరం పల్లె వెలుగు నవంబర్ 17 బాలికల



భవిష్యత్తుకు బాటలు వేస్తూ పాఠశాల అభివృద్ధికి విద్యాకమిటీ చైర్మన్ భీమన్న చేస్తున్న కృషి అభినందనీయమని నందవరం కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ శైలజ తెలిపారు.పాఠశాల అభివృద్ధికి ఆయన నిరంతరం చొరవ చూపుతూ విద్యార్థినులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యాభివృద్ధికి తోడ్పడే సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.మండలానికి చెందిన ఓ దాత అందించిన రెండు కుట్టు మిషన్లను మంగళవారం పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శైలజ మాట్లాడుతూ.. బాలికలకు విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను నేర్పించడం ఎంతో అవసరమని అన్నారు. దాతలను సంప్రదించి వారి సహకారంతో పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చేందుకు భీమన్న చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు.గతంలోనూ పాఠశాలకు అవసరమైన పలు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.అనంతరం విద్యా కమిటీ చైర్మన్ భీమన్న మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం మరింతమంది దాతలు ముందుకు రావాలని కోరారు.పాఠశాలకు కుట్టు మిషన్లు అందించమని ఓ దాతకు వివరించగానే ఆయన వెంటనే స్పందించి రెండు మిషన్లు అందజేయడం సంతోషకరమని తెలిపారు.బాలికల విద్య,ఆటలు,నైపుణ్యాభివృద్ధికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రజాప్రతినిధులు,అధికారులు,ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని బాలికల పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,దాతల సహకారంతో విద్యార్థినులకు మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని భీమన్న తెలిపారు.

పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం

ధీమా వ్యక్తం చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

అవుకు మండల కూటమి నాయకులతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష



బనగానపల్లె, నవంబర్ 17,పల్లెవెలుగు రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఘనవిజయం సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉందని, ప్రజల ఆశీస్సులతో గ్రామస్థాయిలోనూ కూటమి విజయపరంపర కొనసాగుతుందని పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణ శివారులోని కాపులపల్లె ఫాంహౌస్‌లో అవుకు మండలానికి చెందిన ఎన్డీఏ కూటమి నాయకులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న సానుకూలత పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రతిబింబిస్తుందని అన్నారు.

గ్రామస్థాయిలో కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు.

అవుకు మండలంలోని ప్రతి గ్రామంలో ఎన్డీఏ కూటమి బలాన్ని మరింత పెంచుతూ, బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

యనకండ్ల వద్ద రోడ్డు ప్రమాదం



బనగానపల్లె, నవంబర్ 17, పల్లెవెలుగు మండలం లోని యనకండ్ల గ్రామం జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ హకీం ఖాసీం హుస్సేన్ (44) అక్కడికక్కడే మృతి చెందగా అతని కుమారుడు కుమారుడు అఖిమ్ దానిస్ కు తీవ్ర గాయాలయ్యాయి . మంగళవారం బనగానపల్లె పట్టణానికి చెందిన షేక్ హకీం ఖాసీం హుస్సేన్,కుమారుడు అఖిమ్ దానిస్ తో కలిసి బనగానపల్లె నుండి కర్నూలుకు లా సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా మార్గ మధ్యలో యనకండ్ల జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో తిప్పారు డ్రైవర్ అజాగ్రత్తతో అతివేగంగా వచ్చి మోటార్ సైకిల్ ను ఢీకొట్టడంతో హకీం ఖాసీం హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు అఖిమ్ దానిస్ కు తీవ్ర గాయాలయ్యాయి . మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కల్పనా తెలిపారు.

టిడిపి ఖాతాలో మూడు గ్రామపంచాయతీ లు ఏకగ్రీవం

దొర్నిపాడు నవంబర్ 17 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్రంలో మొదటి విడత జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో దొర్నిపాడు మండలం లోని కొత్తపల్లి,చాకరాజు వేముల అమ్మిరెడ్డినగరంగ్రామపంచాయతీ స్థానాలను టిడిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది, మొత్తం మండలంలో11గ్రామపంచాయతీలు ఉండగా3పంచాయతీ లు ఏకగ్రీవం అయ్యాయి ,మిగతా గ్రామపంచాయతీలను కూడా ఏకగ్రీవం చేయడానికి అధికార పార్టీ పావులుకలుపుతున్నట్టు సమాచారం, గ్రామాల లోకక్షలు కార్పన్యాలు, వై సమ్యాలు లేకుండా ప్రశాంతంగా ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఏకగ్రీవాలను చేసేందుకు కృషి చేస్తున్నట్లు సమాచారం

రూ.22.70 లక్షలతో కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని ఇందిరానగర్ 20, 21వ వార్డుల పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు పడింది. ఆదోని టీడీపీ ఇంచార్జి శ్రీ కే. మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఎరుకల కాలనీ నుంచి క్రిస్టియన్ స్మశానం వరకు రూ.22.70 లక్షల వ్యయంతో రెండు అడుగుల వెడల్పుతో నిర్మించనున్న కాలువ పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. 21వ వార్డు కౌన్సిలర్ కొమ్ము రామలక్ష్మి, 20వ వార్డు కౌన్సిలర్ బన్నూరు మీనాక్షి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని టీడీపీ సీనియర్ నాయకులు భూపాల్ చౌదరి, యువ నాయకులు మారుతి నాయుడు హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలువ నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐ.సి. రామకృష్ణ (అడ్వకేట్), రాజేష్, వలి, కృష్ణ, శాంతమూర్తి, సూరి, యు. రంగస్వామి, బడే హనుమంతు, గౌస్, బాలరాజు, శరభ, అంజి, నాగరాజు, నరసప్ప, హరి, రామాంజి, వై. మారెన్న, కిట్ట, సోము, వై. ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



దేవసాని ఆదిత్య రెడ్డి గారి జన్మదిన వేడుకలు ఘనంగా

పోరుమామిళ్ల నవంబర్ 17 (పల్లె వెలుగు):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బద్వేల్ నియోజకవర్గ యువ నాయకుడు, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి గారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఈరోజు పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ శ్రీ డి.సి. గోవిందరెడ్డి గారు, వారి కుటుంబ సభ్యులు పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి ఎంతో ఆప్యాయంగా, ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి సమక్షంలో దేవసాని ఆదిత్య రెడ్డి గారి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి, పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఆదిత్య రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజల ఆదరాభిమానాలతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



"చట్టాల అవగాహన ప్రతి ఒక్కరి బాధ్యత"



బనగానపల్లె, నవంబర్ 17,పల్లెవెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బనగానపల్లె యందు ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మల్లె తులసీశ్వరమ్మ బనగానపల్లె అడ్వకేట్ బార్ జనరల్ సెక్రటరీ పానెల్ అడ్వకేట్ మరియు ఇండియన్ అసోసియేషన్ లాయర్ ప్రెసిడెంట్ నంద్యాల మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని సమాజంలో అనేక సమస్యలు వాటి పరిష్కారం మార్గాలు న్యాయస్థానాల దగ్గర లభిస్తుందని వాటిని పరిష్కరించుకునే అవగాహన ప్రతి ఒక్క పౌరుడు కలిగి ఉండాలని, చట్టాల అవగాహన అనేది విద్య ద్వారా అనేక విషయాలను అర్థం చేసుకొనే అవకాశం లభిస్తుంది అని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆజా హుస్సేన్,ముజాహిద్ హుస్సేన్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ రెడ్డి, నాగరాజు పుల్లయ్య,రామసుబ్బయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com